సాక్షి అనంతపురం

గురువారం । 24 । ఆగస్టు । 2023



డీఎంహెచ్‌ఓగా ఈబీ దేవి

జిల్లా నూతన డీఎంహెచ్‌ఓగా ఈబీ దేవి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.



జీడిపల్లికి కృష్ణా జలాలు

హంద్రీ–నీవా సుజల స్రవంతి కాలువ ద్వారా కృష్ణా జలాలు బుధవారం జీడిపల్లి రిజర్వాయర్‌కు చేరాయి.

గరిష్టం/కనిష్టం
37.0°/26.4°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

డ్రైల్యాండ్ హార్టికల్చర్‌ను వేగవంతం చేయాలి



అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో భాగంగా మెట్ట భూముల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్ పనులను వేగవంతంగా చేపట్టాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఉపాధి హామీ ఏపీడీ, ఏపీఓలతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,400 మంది రైతులు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే 2,200 మంది రైతులకు సంబంధించి 6వేల ఎకరాల్లో పండ్ల మొక్కల సాగుకు అనుమతులను మంజూరు చేసినట్లు చెప్పారు. నెలాఖరులోపు 100 శాతం పనులు పూర్తయ్యే విధంగా సిబ్బంది చొరవ చూపాలన్నారు. పండ్ల మొక్కలు కొనుగోలు చేసే రైతులకు నేరుగా వారి ఖాతాల్లోనే నిధులను జమ చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి పనులకు వచ్చే రోజువారి కూలీల సంఖ్య పెంచే విధంగా ప్రణాళికలను రూపొందించుకోవాలని ఆదేశించారు.

ఫైళ్లన్నీ క్లియర్ కావాల్సిందే

- జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన జేసీ కేతన్‌గార్గ్



జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్‌కు సంబంధించిన పెండింగ్ ఫైళ్లన్నీ క్లియర్ చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓగా నియమితులైన ఆయన.. బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆయనకు జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, డీఎల్‌డీఓ చిలంకూరు ఓబుళమ్మ, అన్ని విభాగాల ఏఓలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం వారితో కేతన్‌గార్గ్ కాసేపు మాట్లాడారు. ఈ నెల 26న జరగనున్న జెడ్పీ సర్వసభ్య సమావేశంపై ఆరా తీశారు. సమావేశం తరువాత అన్ని విభాగాల ఏఓలతో వేర్వేరుగా సమీక్షిస్తానని, ఫైళ్లన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఏ ఒక్కటీ పెండింగ్‌లో ఉండడానికి వీల్లేదన్నారు. జిల్లా పరిషత్ ప్రతిష్ట పెంచేందుకు ఉద్యోగులందరూ కష్టపడి పని చేయాలని సూచించారు.

ప్రతి భారతీయుడి హృదయం గర్వంతో ఉప్పొంగింది. 41 రోజుల ప్రయాణం తర్వాత విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై కాలుమోపగానే దేశమంతా సంతోషంలో మునిగిపోయింది. అగ్ర దేశాలే విఫలమైన చోట... ఎవరూ చూడని, అడుగుమోపని చంద్రుడి దక్షిణ ధ్రువంపై భారత్ తొలి అడుగు వేసింది. అంతరిక్షరంగంలో సువర్ణాక్షరాలతో సరికొత్త చరిత్రను లిఖించింది. బుధవారం సాయంత్రం 6:04 గంటలకు విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై సేఫ్ ల్యాండింగ్ కాగానే విశ్వమంతా జయహో భారత్ అంటూ నినదించింది. దేశ భక్తిని చాటుతూ త్రివర్ణ పతాకంతో యువకులు వీధుల్లో ఉత్సాహంగా తిరిగారు.



అనంతపురంలో జాతీయ జెండాలతో విద్యార్థుల ర్యాలీ

జాబిల్లి అందె..
జగమంత మురిసె



- చంద్రయాన్–3 సక్సెస్‌తో జిల్లా అంతటా సంబరాలు
- చరిత్రాత్మక ఘట్టాన్ని తిలకించి కేరింతలు

అనంతపురం : చంద్రయాన్–3 ల్యాండింగ్ మిషన్ విజయవంతం కావడంతో జిల్లాలో సంబరాలు మిన్నంటాయి. చంద్రుడిపై చరిత్రాత్మక ఘట్టాన్ని వీక్షించి విద్యార్థులు కేరింతలు కొట్టారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలవడం గర్వకారణమని మేధావులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని ప్రశంసించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ అనంతపురంతో పాటు జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో చంద్రయాన్–3 ల్యాండర్ దిగే ఘట్టాలను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా వీక్షించారు. ప్రయోగం విజయవంతమైన తర్వాత సంబరాలు అంబరాన్నంటాయి. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి స్వగృహంలో కేకు కట్ చేసి పంచిపెట్టారు. నగర మేయర్ వసీం సలీం తదితరులు సంబరాల్లో పాలుపంచుకున్నారు. అనంతపురంతో పాటు రాయదుర్గం, పామిడి తదితర ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు.

దేశానికే గర్వకారణం



భారత ఖగోళ శాస్త్రవేత్తలకు ఇదో అద్భుత ఘట్టం. ప్రపంచ దేశాలకే మన వారు ఆదర్శంగా నిలిచారు. ఇప్పటి దాకా ఏ దేశమూ చేయని సాహసాన్ని భారత్ చేసింది. విజయం సాధించి సత్తా చాటింది. చంద్రయాన్–1 నుంచి, చంద్రయాన్–3లోపే లక్ష్యం సాధించేలా కృషి చేయడం గర్వకారణం. శాస్త్రవేత్తలకు ప్రజలందరి తరపున అభినందనలు.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

ఇది ఒక మైలురాయి



చంద్రయాన్ – 3ని విజయవంతం చేసి వ్యోమనౌక విక్రమ్‌ను చంద్రుడిపై ల్యాండ్ చేయటం రోదసీ చరిత్రలో ఒక మైలురాయి. ప్రపంచ అగ్ర దేశాలైన అమెరికా, రష్యా, చైనా, జపాన్‌లను తలదన్నేలా తొలిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను దింపటం మన ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన గొప్ప ఘనత. దీనికి కారణమైన శాస్త్రవేత్తలు, ప్రభుత్వ అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నాం. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాప్తాడు

శాస్త్రవేత్తల అంకితభావానికి నిదర్శనం



చంద్రయాన్–3 విజయవంతం కావడం ఇస్రో శాస్త్రవేత్తలు, పరిశోధకుల అంకిత భావానికి, అచంచలమైన స్ఫూర్తికి నిదర్శనం. గ్లోబల్ స్పేస్ కమ్యూనిటీలో ఇండియా స్థానం పదిలపరుచుకుంది. చంద్రయాన్ ప్రయాణం, విజయవంతంగా ల్యాండింగ్ అంతరిక్ష అన్వేషణ, శాస్త్రీయ పురోగతి సరిహద్దులను ముందుకు తీసుకురావడానికి దోహదపడతాయి. ఇస్రో, చంద్రయాన్–3 ప్రాజెక్టు వెనుక ఉన్న బృందానికి హృదయపూర్వక అభినందనలు.

– ఆలూరు సాంబశివారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (విద్య)

మిషన్ సిమ్యులేషన్ టీమ్‌దే బాధ్యత



చేపట్టబోయే ప్రాజెక్ట్ ఏ పరిస్థితుల్లో ఫెయిల్ అవుతుందని ముందస్తుగా సిమ్యులేషన్ చేస్తాం. ఫెయిల్ అయ్యే ఛాన్స్ ఉంటే సాఫ్ట్‌వేర్ వాళ్లకి చెప్పి అప్‌డేట్ చేయిస్తాం. ఇలా కనీసం 1000 సార్లు సిమ్యులేషన్ చేశాం. భూగ్రహం నుంచి చంద్రుని గ్రహంలోకి వెళ్లే మధ్యలో ప్రక్రియ జరిగే నేవిగేషన్‌కు మా టీం బాధ్యత వహిస్తుంది. మిషన్ సిమ్యులేషన్ గ్రూప్‌లో 30 మంది దాకా ఉన్నాం.

– చందన, చంద్రయాన్–3 ప్రాజెక్ శాస్త్రవేత్త (జేఎన్‌టీయూ(ఏ) పూర్వ విద్యార్థి)

చరిత్రాత్మక ఘట్టం



చంద్రుని దక్షిణ ధ్రువం ఎంచుకోవడానికి ప్రధాన కారణం అక్కడ నీటి జాడలు ఉన్నట్లు భావిస్తుండడమే. ఆ ప్రాంతంలో మంచు స్ఫటికాల రూపంలో నీటి నిల్వలు ఉన్నాయని ఇస్రో గుర్తించింది. దక్షిణ ధ్రువంపై గురుత్వాకర్షణ చాలా తక్కువగా ఉంటుంది. అక్కడ వెలుతురు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు మైనస్‌లో ఉంటాయి. కాబట్టి నీరు ఉండే అవకాశం ఉంటుంది. ఇస్రో అంచనా ప్రకారం అక్కడ పది కోట్ల టన్నుల మేర నీరు ఉండొచ్చు. నీరు ఉన్న చోట మనిషి నివసించగలడు. కాబట్టి భవిష్యత్తులో చంద్రునిపై పరిశోధనలకు ఇది ఎంతగానో దోహదపడుతుంది. చంద్రయాన్–3 విజయవంతం కావడం చరిత్రాత్మక ఘట్టం.

–కె.రాంగోపాల్, ఇస్రో ఎస్కేయూ ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్

ప్రత్యేక అభినందనలు



చంద్రయాన్ –3 చరిత్ర సృష్టించింది. జాబిల్లిపై ఇప్పటి వరకు ఏ దేశమూ కాలుమోపని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ కాలు మోపింది. అంతరిక్షంలో భారత ప్రతిష్టను చాటి చెప్పింది. శాస్త్ర సాంకేతిక రంగాలలో భావితరాలకు బాటలు వేసింది. చంద్రయాన్ టీమ్‌కు ప్రత్యేక అభినందలు. ఈ విజయం యావత్ భారతీయులకు ఆనందాన్ని కలిగించింది. నిజంగా ఇది పండుగ రోజే. రానున్న రోజుల్లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలి.

– ఉషశ్రీచరణ్, మంత్రి

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు



అంతరిక్ష చరిత్రలో భారత్ సరికొత్త అధ్యాయం లిఖించింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ నిలవడం సంతోషంగా ఉంది. ఇది మన దేశం సాధించిన ఘనత. ఇస్రో శాస్త్రవేత్తల కృషి ప్రశంసనీయం. ఇస్రో సాధించిన విజయం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది.

– అనంత వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే, అనంతపురం

చరిత్ర లిఖించిన ఇస్రో



చంద్రయాన్–3 విజయవంతంతో ఇస్రో శాస్త్రవేత్తలు చరిత్ర లిఖించారు. అమెరికా, రష్యా, చైనా లాంటి అగ్ర దేశాలకంటే తామేమీ తక్కువ కాదని నిరూపించారు. చంద్రుడి మీద హక్కు సాధించేలా కీలక భూమిక పోషించారు. వారందరికీ అభినందనలు.

– నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

శాస్త్రవేత్తల కృషి అమోఘం



చంద్రయాన్–3 విజయవంతం చేయడంలో భారత శాస్త్రవేత్తల కృషి ప్రశంసనీయం. ఇస్రోతో 50 దేశాలు ఒప్పందాలు చేసుకున్నాయి. భవిష్యత్తు నానో శాటిలైట్‌లదే. శాటిలైట్ ప్రయోగాల్లో భారత్ అంతర్జాతీయ సమాజానికి వేదిక కానుండడమే ఇందుకు కారణం. నానో శాటిలైట్ విప్లవానికి ఇస్రో దన్నుగా నిలుస్తోంది. చంద్రయాన్–3 విజయవంతం కావడంతో మా కళాశాలలో సంబరాలు చేసుకున్నాం.

– కె.హర్షిత, బీటెక్ మూడో సంవత్సరం, తాడిపత్రి



ఎస్కేయూలో లైవ్‌స్ట్రీమ్ ద్వారా చంద్రయాన్–3 ల్యాండింగ్ ప్రక్రియను వీక్షిస్తున్న విద్యార్థులు

భారత్ సరికొత్త చరిత్ర



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అంతరిక్ష పరిశోధన చరిత్రలో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించిందని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సాయంత్రం ఎస్పీ, పలువురు పోలీసు అధికారులు చంద్రయాన్–3 ల్యాండింగ్ స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలు నుంచి టీవీ ద్వారా వీక్షించారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఇది మన దేశం సాధించిన ఘనత అని ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. చంద్రయాన్– 3 విజయవంతమైన సందర్భంగా స్వీట్లు పంచిపెట్టారు.



చంద్రయాన్–3 సక్సెస్ తర్వాత రాప్తాడులో విద్యార్థుల ఆనందం

పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా సేవలు



మాట్లాడుతున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా పోలీసులు సేవలందించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలోని కాన్ఫరెన్స్ హాలులో ఆయన సిబ్బందితో కలసి నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రాధాన్యత కేసుల్లో త్వరితగతిన పురోగతి సాధించాలన్నారు. ప్రజలు భద్రతాభావం, భరోసాతో జీవించేలా పోలీసింగ్ ఉండాలన్నారు. మనసుతో చేసే పనులు మంచి ఫలితాలనిస్తాయన్న వాస్తవాన్ని గ్రహించాలన్నారు. ప్రత్యేక నిఘా వేసి రౌడీషీటర్లు, కిరాయి హంతక ముఠాల పీచమణచాలని ఆదేశించారు. ముందస్తు చర్యలతో చైన్‌స్నాచింగ్ నియంత్రించాలన్నారు. రాత్రి వేళ బీట్లను సమర్థవంతంగా నిర్వహించేలా ప్రతి అధికారీ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేవ్ కేసుల్లో ముద్దాయిలకు తప్పనిసరిగా శిక్ష పడేలా చూడాలన్నారు. చార్జ్‌షీటు దాఖలుతో పాటు ట్రయల్ దాకా ఎక్కడా నిందితుడు తప్పించుకునేలా అవకాశం ఇవ్వకుండా పోలీసులు కృషి చేయాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. ఆస్తి వివాదాల్లో పోలీసుల పాత్ర పరిమితికి మించి ఉండకూడదన్నారు. జిల్లాలో మట్కా, క్రికెట్ బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల పోలీసులు గౌరవంగా, మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. సమస్యలకు తక్షణ పరిష్కారం చూపగలిగితే పోలీసులపై గౌరవం పెరుగుతుందన్నారు. 'స్పందన' అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, మహిళలపై అఘాయిత్యాలపై పోలీసుల చర్యలు వేగవంతంగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కరరెడ్డి, జి.రామకృష్ణ, హనుమంతుతో పాటు డీఎస్పీలు ఆంథోనప్ప, బి.శ్రీనివాసులు, యు.నరసింగప్ప, జి.ప్రసాద్‌రెడ్డి, మునిరాజ్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

తొలగింపు క్లెయిమ్‌లు 96 వేలు

- రీ వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలి
- సర్వే మిగిలి ఉంటే 25లోగా పూర్తి చేయాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జిల్లాలో 2022 జనవరి 6 నుంచి ఈ నెల 9 వరకు 96,153 ఓటరు తొలగింపునకు క్లెయిమ్‌లు వచ్చాయని కలెక్టర్ గౌతమి తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో చేపట్టిన ఇంటింటి సర్వే 98.8 శాతం పూర్తయ్యిందని, మిగిలినవి ఈ నెల 25లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ నుంచి అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్‌జైన్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ శ్రీనివాసులుతో కలిసి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఎన్నికల డీటీలు, బీఎల్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి సూచనలు వచ్చినా వెంటనే బీఎల్‌ఓలకు అధికారులు తెలియజేయాలన్నారు. డెత్, షిఫ్టింగ్ సంబంధించి అన్ని కేసుల రీ–వెరిఫికేషన్ పకడ్బందీగా చేయాలన్నారు. రెండు శాతం కంటే అధికంగా తొలగింపులు ఉంటే ఈఆర్‌ఓ కచ్చితంగా పరిశీలించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నెలాఖరులోగా రీ–వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. డెత్, షిఫ్టింగ్ కేసుల రీ–వెరిఫికేషన్ కోసం నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. రాయదుర్గానికి డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య, ఉరవకొండకు డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్, గుంతకల్లుకు డీపీఓ ప్రభాకర్‌రావు, తాడిపత్రికి డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, శింగనమలకు డీఎల్‌డీఓ ఓబుళమ్మ, అనంతపురం అర్బన్‌కు మెప్మా పీడీ విజయలక్ష్మి, కళ్యాణదుర్గానికి డీఎల్‌డీఓ శంకర్, రాప్తాడుకు నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మిని నియమించినట్లు వెల్లడించారు. ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా 500 డెత్, షిఫ్టింగ్ కేసులను రీ–వెరిఫికేషన్ చేయాలని సూచించారు. వయసు వందేళ్లు దాటిన ఓటర్ల పరిశీలన సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఒకే ఇంటిలో ఎక్కువ మంది ఓటర్లు ఉండి, ఆ ఇంటిలో ఎక్కువ పోర్షన్‌లు ఉంటే నోషనల్ ఇంటి నంబరు ఇవ్వాలన్నారు. నోషనల్ నంబర్లు ఇచ్చారా లేదా అని పరిశీలించాలన్నారు. రీ–వెరిఫికేషన్ పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.

రీ–వెరిఫికేషన్‌కు సహకరించాలి

డెత్, షిఫ్టింగ్ కేసుల రీ వెరిఫికేషన్‌కు రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని కలెక్టర్ గౌతమి సూచించారు. కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నోటీసు ఇచ్చిన తరవాతే జాబితా నుంచి ఓటరు పేరు తొలగిస్తారన్నారు. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ తొలగింపునకు 15 రోజులు గడువు ఉంటుందన్నారు. షిఫ్టింగ్ కేసుల విషయంలోనూ నోటీసును పోస్టులో పంపిస్తారన్నారు. ఈ విషయంలో బీఎల్‌ఓలు స్పష్టత కలిగి ఉండాలని చెప్పారు. రెండు చోట్ల ఓటు ఉంటే ఒకటి తొలగించాలని పార్టీల ప్రతినిధులు కోరారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేస్తున్నారని, రెండు చోట్ల ఓటు ఉంటే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి కె.వి.రమణ, టీడీపీ ప్రతినిధి పవన్‌కుమార్, బీఎస్పీ ప్రతినిధి హరిప్రసాద్, బీజేపీ ప్రతినిధి ఈశ్వర్‌ప్రసాద్, ఏఏపీ ప్రతినిధి హుస్సేన్, సీపీఐ ప్రతినిధి అల్లీపీరా తదితరులు పాల్గొన్నారు.

చంద్ర హాస్పిటల్‌కు షోకాజ్

- సంతాన సాఫల్య చికిత్స వికటించి మహిళ మృతి
- వైద్యుల నిర్లక్ష్యంపై భగ్గుమన్న బంధువులు



మృతురాలు మోదీన్‌బీ

అనంతపురం శ్రీకంఠం సర్కిల్/ క్రైం: సంతాన సాఫల్య చికిత్స వికటించి మహిళ మృతి చెందిన ఘటనకు సంబంధించి చంద్ర హాస్పిటల్‌లోని మాత్రికాస్ ఫర్టిలిటీ సెంటర్‌కు డీఎంహెచ్‌ఓ యుగంధర్ బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా జోహరాపురం గ్రామానికి చెందిన మోదీన్ బీ(33)కి ఉరవకొండ మండలం పీసీ ప్యాపిలికి చెందిన వన్నూరుస్వామితో వివాహం జరిగింది. ఏడేళ్లయినా సంతానం కలగకపోవడంతో మోదీన్ బీ నగరంలోని చంద్ర హాస్పిటల్‌లోని మాత్రికాస్ ఐవీఎఫ్ ఫర్టిలిటీ సెంటర్ డాక్టర్ తస్వీన్‌కార్‌రెడ్డి వద్ద సంతాన సాఫల్య చికిత్స తీసుకుంటోంది. ఐవీఎఫ్ పద్ధతి ప్రకారం జూన్ 30న మోదీన్‌బీ అండాలను డాక్టర్ సేకరించి భద్రపరిచారు. అండాలు ఉంచడానికి గర్భసంచిని పరిశీలించగా.. అందులో వాల్స్ బ్లాక్ అయినట్లు గుర్తించారు. డయాగ్నస్టిక్ హిస్ట్రో ల్యాప్రోస్కోపింగ్ సర్జరీ చేసి బ్లాక్స్ తొలగించాలని తెలపడంతో ఈ నెల 22న ఉదయం 11 గంటలకు మోదీన్ బీ మాత్రికాస్ ఫర్టిలిటీ సెంటర్‌లో అడ్మిట్ అయ్యింది. వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి అనస్తీషియా ఇచ్చారు. కొద్దిసేపటికే పలుమార్లు ఫిట్స్ వచ్చి మోదీన్ బీ అపస్మారక స్థితిలోకి వెళ్లింది. రెండు మూడు గంటలపాటు ఎంతగానో శ్రమిస్తున్నట్లుగా నటించి.. రాత్రి 8.10 గంటలకు మోదీన్ బీ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

భగ్గుమన్న బంధువులు

వైద్యుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందని మోదీన్‌బీ బంధువులు భగ్గుమన్నారు. ఆస్పత్రి వద్దకు భారీ సంఖ్యలో చేరుకుని ఆందోళనకు దిగారు. 'పరిహారం' పేరిట పంచాయితీ చేయాలని చూసిన యాజమాన్యంపై నిప్పులు చెరిగారు. వారి ప్రశ్నలకు ఆస్పత్రి వైద్య బృందం వైపు నుంచి సరైన సమాధానం లేదు. చేజేతులా మోదీన్‌బీని చంపేశారంటూ బంధువులు రోదించారు. మృతికి కారణమైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మాత్రికాస్ ఫెర్టిలిటీ సెంటర్‌ను సీజ్ చేయాలని మోదీన్‌బీ తమ్ముడు మున్వర్ బుధవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్‌కు ఫిర్యాదు చేశారు. మృతికి కారకులైన గైనకాలజిస్టు తస్వీన్‌కార్‌రెడ్డి, అనస్తీషియా డాక్టర్ హరికృష్ణపై చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



మాత్రికాస్ ఐవీఎఫ్ సెంటర్ నిర్వాహకురాలు తస్వీన్‌కార్‌రెడ్డికి షోకాజ్ నోటీసు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ యుగంధర్

సవాలుగా రూ.కోట్ల దారి దోపిడీ

- రంగంలోకి ప్రత్యేక పోలీసు బృందాలు
- బెంగళూరు నుంచి వెంటాడిన దోపిడీ దొంగలు
- సాంకేతిక ఆధారాల కోసం ఆరా
- ఘటనపై కేసు నమోదు చేసిన గార్లదిన్నె పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్/గార్లదిన్నె: గార్లదిన్నె మండలం రామదాస్‌పేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కారులో వెళుతున్న వ్యక్తులను అటకాయించి రూ.కోట్లు అపహరించుకెళ్లిన కేసు దర్యాప్తును పోలీసులకు సవాల్‌గా తీసుకున్నారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు సారథ్యంలో రంగంలోకి ప్రత్యేక బృందాలను దింపారు. ఎట్టకేలకు దారిదోపిడీకి బెంగళూరులోనే బీజం పడినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

ఏం జరిగిందంటే..

హైదరాబాద్‌లో ఎస్‌ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ అడ్మిన్ శ్రీపతి, పర్చేజింగ్ మేనేజర్ అనూపకుమార్ మంగళవారం బెంగళూరు నుంచి కంపెనీకి చెందిన రూ.2కోట్లు తీసుకుని డ్రైవర్ శివతో కలసి ఇన్నోవా కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. అదే రోజు రాత్రి గార్లదిన్నె మండలం తలగాచిపల్లి వద్దకు చేరుకోగానే మరో ఇన్నోవా కారులో వచ్చిన నలుగురు యువకులు శ్రీపతి ప్రయాణిస్తున్న కారును ఆపి తాము పోలీసులమని నమ్మబలికారు. శ్రీపతి, అనూపమ కుమార్‌ను దింపి, డ్రైవర్ శివతో ఇద్దరు యువకులు ఇన్నోవా కారును రామ్‌దాస్ పేట సమీపంలోకి తీసుకెళ్లి అక్కడ డ్రైవర్ శివను, కారు వదిలి రూ.2 కోట్లు తీసుకుని తమ కారులో అనంతపురం వైపుగా వెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు.

సాంకేతిక ఆధారాలతో వేట

బెంగళూరు నుంచి శ్రీపతి బృందం బయలుదేరినప్పటి నుంచి వారి ప్రతి కదలికపై సాంకేతిక ఆధారాలను సేకరించే పనిలో పోలీసులు పడ్డారు. బెంగళూరులో వీరు బయలు దేరిన సమయంలో ఎవరో ఫాలో అవుతున్నారు. వీరితో డబ్బు ఉందన్న పక్కా సమాచారం వారు ఎలా తెలుకున్నారు. దారి దోపిడీకి ముందుగానే ప్రణాళిక రచించారా? విచారణలో బాధితుల చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని పోలీసులు అడుగు ముందుకేస్తున్నారు. నిందితులు పోలీసుల దుస్తుల్లో వచ్చి దోపిడీకి తెగబడ్డారన్నదానిపై కూడా స్పష్టత లేనట్లుగా తెలుస్తోంది.



పాపం పసికందు

- పీహెచ్‌సీ పక్కనే రోడ్డుపై వదిలేసిన తల్లి
- స్పందించిన వైద్య సిబ్బంది





శిశుగృహ సిబ్బందికి చిన్నారిని అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు(ఇన్‌సెట్‌లో) అనాథగా మారిన చిన్నారి

కుందుర్పి: వారం రోజుల పసికందును ఓ కన్నతల్లి రోడ్డు పక్కన వదిలేసింది. చిన్నారి రోదనలతో అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది వెంటనే స్పందించి చికిత్స అందజేసి, శిశుగృహకు చేర్చారు. వివరాలు... కుందుర్పిలోని పీహెచ్‌సీ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఓ తల్లి వారం రోజుల వయసున్న మగశిశువును వదిలేసి వెళ్లింది. అర్ధరాత్రి కావడంతో ఈ విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. వేకువజామున చిన్నారి ఏడుపు విన్న ఆస్పత్రి సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని శిశువును అక్కున చేర్చుకున్నారు. సమాచార అందుకున్న డాక్టర్ అనూష అక్కడకు చేరుకుని వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రాణాపాయ స్థితి నుంచి చిన్నారిని కాపాడారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు పీహెచ్‌సీకి చేరుకుని చిన్నారి ఆరోగ్యంపూ ఆరా తీశారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ వనజా అక్కమ్మ సూచన మేరకు పోలీసుల పర్యవేక్షణలో అనంతపురంలోని శిశుగృహకు శిశువును చేర్చారు. కాగా, ఆస్పత్రిలో శిశువు చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పలువురు అక్కడకు చేరుకుని ఆ చిన్నారిని తమకిస్తే పెంచుకుంటామంటూ అధికారులను అభ్యర్థించారు.

నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న లక్ష్యం

- మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ

కళ్యాణదుర్గం రూరల్: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే సీఎం వైఎస్ జగనన్న లక్ష్యమని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ అన్నారు. కళ్యాణదుర్గంలోని ఇందిరమ్మ కాలనీ, కురాకుల తోటలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను బుధవారం వారు ప్రారంభించి, మాట్లాడారు. టీడీపీ హయాంలో ప్రజారోగ్యానికి భరోసా లేకుండా పోయిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజారోగ్యంపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తూనే అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి వివిధ రకాల వైద్య పరీక్షలతో పాటు నాణ్యమైన చికిత్సలూ అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ వెంకటేశులు, వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, డీపీఎంఓ చెన్నకేశవ్, సుజాత, డాక్టర్లు సత్యప్రియా, రిహాజైనబ్, రాజేష్, జేసీఎస్ కన్వీనర్ అర్చన, మార్కెట్ యార్డ్ మాజీ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, నాయకులు కిరిటీ, సుబ్బరాయుడు, నారాయణ, సోమశేఖరరెడ్డి కృష్ణారెడ్డి, హరి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్ ఎమ్మెల్సీ మంగమ్మ

దమ్ముందా కేశవ్?

- దొంగ ఓట్లు చేర్పించినట్లు నిరూపిస్తే మీరేమి చెబితే అదే చేస్తా
- లేకుంటే ఉరవకొండ సెంటర్‌లో దుస్తులిప్పి కూర్చుంటావా?
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రణయ్‌రెడ్డి

అనంతపురం క్రైం: టీడీపీ సానుభూతిపరుల 6,063 ఓట్లు తొలగించి, వైఎస్సార్‌సీపీకి చెందిన 6వేల ఓట్లు ఎక్కించారని ఎల్లో మీడియా, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆరోపిస్తున్నారని, నిజంగా కేశవ్‌కు దమ్ముంటే దొంగ ఓట్లను నిరూపించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్ రెడ్డి సవాల్ విసిరారు. టీడీపీ ఆరోపణలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను దొంగ ఓట్లు ఎక్కించినట్లు నిరూపిస్తే టీడీపీ ఏం చెబితే అది చేస్తానన్నారు. ఒకవేళ రుజువు చేయకపోతే ఉరవకొండ టవర్‌క్లాక్ వద్ద దుస్తులిప్పి కూర్చోవడానికి కేశవ్, ఏబీఎస్ రాధాకృష్ణ, తదితర టీడీపీ నేతలు సిద్ధమవుతారా? అంటూ ప్రశ్నించారు. ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించి మృతిచెందిన వారు, 15 ఏళ్ల కిందట పెళ్లిళ్లైన వారు, 30 ఏళ్ల కిందట దేశాన్ని వదిలిన వారు, తదితర మొత్తం 8వేలకుపైగా ఓట్లున్నాయని, వీటిపై తమకు అనుమానాలుండడంతో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి జూలై 24న ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను మీడియాకు చూపించారు. వీటిని తొలగిస్తే జీవితంలో తాను గెలవలేననే భయం పట్టుకుని కేశవ్ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. 2019 నుంచి 2020, 2021 వరకు మొత్తం 2,912 ఓట్ల తొలగింపునకు సంబంధించి నోటీసులు, సరైన పద్ధతులను అనుసరించలేదన్న కారణంతో సంబంధిత రిటర్నింగ్ అధికారులు శోభా స్వరూప రాణి, భాస్కర్‌రెడ్డిని ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిందన్నారు. అయితే దీనికి వక్రభాష్యం చెబుతూ తనకు అనుకూలంగా ఎమ్మెల్యే కేశవ్ చేసుకుంటున్న ప్రచారం హాస్యాస్పదంగా ఉందన్నారు. దొంగ ఓట్లపై పార్టీ ముఖ్యనేతలతో కలసి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ధీరోదాత్తుడు ప్రకాశం పంతులు : కలెక్టర్

అనంతపురం అర్బన్: సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పోలీసుల తుపాకీకి ఎదురు నిలిచి దమ్ముంటే కాల్చాలంటూ సవాల్ విసిరిన టంగుటూరి ప్రకాశం పంతులు ధీరోదాత్తుడిగా చిరస్మరణీయులయ్యారని కలెక్టర్ ఎం.గౌతమి కొనియాడారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. ప్రకాశం పంతులు ధైర్య సాహసాలకు మెచ్చి ఆయనకు ఆంధ్రకేసరి అని బిరుదునిచ్చి గౌరవించారని గుర్తు చేశారు. 1946లో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై 13 నెలలు ఆ పదవిలో కొనసాగారన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు నియమితులయ్యారన్నారు. జాతికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా 1972 డిసెంబరు 5న ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్చారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్, ఎస్‌డీసీ ఆనంద్, బీసీ సంక్షేమాధికారి కుష్బూ కొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీధర్, సూపరింటెండెంట్ పుణ్యవతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమి

డిగ్రీ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ ఐదు, ఆరు సెమిస్టర్ ఫలితాలను బుధవారం ఆ వర్సిటీ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. డిగ్రీ ఐదో సెమిస్టర్‌లో బీఎస్సీ, బీసీఏ కోర్సులు కలిపి మొత్తం 5,507 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 3439 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐదు, ఆరో సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ ఎవాల్యుయేషన్ ఫలితాలను వీటితో పాటు విడుదల చేశారు. బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ కోర్సుల్లో మొత్తం 13,934 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 11,991 మంది (92.71 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో గురువారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ కంట్రోలర్ సీహెచ్ కృష్ణుడు, సీఎం అనురాధ, డి.చంద్రమౌళిరెడ్డి, సీడీసీ కె.రాంగోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.చంద్రాయుడు, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా భార్గవ్



భార్గవ్‌కు పుష్పగుచ్ఛాలను అందజేస్తున్న అధికారులు

అనంతపురం టౌన్: జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా భార్గవ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొంతకాలంగా రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్లకు ఇన్‌ఛార్జ్ సబ్ రిజిస్ట్రార్లుగా బాధ్యతలు అప్పగించి సేవలకు అంతరాయం లేకుండా చేశారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల వెలువడిన గ్రూప్ 1 పరీక్ష ఫలితాల్లో వైఎస్సార్ జిల్లాకు చెందిన భార్గవ్ ప్రతిభ కనబరచి జిల్లా రిజిస్ట్రార్‌గా కొలువు సాధించారు. దీంతో శిక్షణలో భాగంగా ఆయనను అనంతపురం జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. 6నెలల పాటు ఈ హోదాలో ఆయన కొనసాగనున్నారు. అనంతరం జిల్లా రిజిస్ట్రార్‌గా పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లు ఇస్మాయల్, టీజీ రెడ్డితోపాటు కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదర్శప్రాయుడు టంగుటూరి : ఎస్పీ

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: నేటితరం యువతకు టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయుడని ఎస్పీ కె. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో ఆయన చూపిన ధైర్య సాహసాలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అమ్మను మించిన దైవం లేదు

- సద్గురు గణపతి సచ్చిదానంద స్వామీజీ



మాతృమూర్తి జయలక్ష్మీమాతా విగ్రహానికి పూజలు చేస్తున్న గణపతి సచ్చిదానందస్వామి

రాప్తాడు/అనంతపురం కల్చరల్: తల్లిని మించిన దైవం లేదని, ప్రతి ఒక్కరూ తల్లిని ప్రేమించి, పూజించి ధన్యులు కావాలని మైసూరు దత్త పీఠం వ్యవస్థాపకులు గణపతి సచ్చిదానందస్వామీజీ అన్నారు. రాప్తాడు మండలం బొమ్మేపర్తి (జయలక్ష్మీపురం)లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో బుధవారం తన మాతృమూర్తి జయలక్ష్మీమాతా, అన్నపూర్ణేశ్వరి మాతా విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. అంతకు ముందు ఆశ్రమానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం 40 గదులతో నిర్మించిన సహస్ర చంద్ర భవనాన్ని ఆయన ప్రారంభించారు. నూతన బృందావనంలో వనమూలికా వృక్షాలు, పూల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాతృ స్వరూప ఔచిత్యం, దాన ధర్మాల విశిష్టతను వివరించారు. తల్లి ఔనత్యాన్ని వివరిస్తున్న సమయంలో కొంత ఉద్వేగానికి లోనయ్యారు. దత్తాత్రేయ సంప్రదాయానికి అందరూ వారసులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వందల సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో ఆశ్రమ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా రాప్తాడు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

విమలాశాంతి పురస్కారానికి రాచపాలెం ఎంపిక



రాచపాలెం చంద్రశేఖరరెడ్డి

అనంతపురం కల్చరల్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న విమలాశాంతి పురస్కారానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డిను ఎంపిక చేశారు. ఈ మేరకు విమలా శాంతి సాహిత్య సేవా సమితి చైర్మన్ డాక్టర్ శాంతినారాయణ బుధవారం వెల్లడించారు. ఈ ఏడాది సాహితీ విమర్శకుల రంగానికి సంబంధించి అందిన ఎంట్రీలను జ్యూరీ సభ్యులు ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య మేడిపల్లి రవికుమార్, అట్టాడ అపల్నాయుడు, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ పరిశీలించి అనంత సాహితీ కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రముఖ సాహితీ విమర్శకులు రాచపాలెం చంద్రశేఖరరెడ్డిని విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు వివరించారు. అక్టోబర్‌లో ఆయనకు సాహితీ పురస్కారాన్ని అందజేసి, ఘనంగా సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థి బలవన్మరణం



మృతిచెందిన విద్యార్థి నాని

గుమ్మఘట్ట: తల్లి ప్రేమ శాశ్వతంగా దూరం కావడంతో జీవితంపై విరక్తితో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్టకు చెందిన చిదానంద, రామక్క దంపతులకు కుమారులు ఎర్రిస్వామి, నాని (14)తో పాటు ఓ కుమార్తె ఉన్నారు. పెళ్లీడుకు వచ్చిన కుమార్తెకు వివాహం చేసి అత్తారింటికి పంపారు. ఎర్రిస్వామి ఇంటర్, నాని 9వ తరగతి చదువుతున్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన రామక్క నాలుగు నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి నాని కుదేలయ్యాడు. ఒంటరిగా తనలో తాను కుమిలిపోయేవాడు. పది రోజులుగా పాఠశాలకు సైతం వెళ్లకుండా ఇంటిపట్టునే ఉంటూ వచ్చాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబసభ్యుల వేదనకు అంతులేకుండా పోయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి.. బాధిత కుటుంబసభ్యులకు తన సానుభూతి వ్యక్తం చేశారు.

టమాట మండీలో సుంకం వసూళ్ల బంద్

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని టమాట మండీలకు సరుకు తరలించే వాహనాల నుంచి ఇకపై ఎలాంటి సుంకం (పన్నులు) వసూళ్లు చేయకూడదని ఈఓఆర్డీ ఎస్.మాధవి, పంచాయతీ కార్యదర్శి జి.నరసింహారెడ్డి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిట్ పిటిషన్ (నంబర్ -11293/2021) తీర్పు, పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీలను టమాట మండీ సమీపంలో ఏర్పాటు చేశారు. ఉత్తర్వులను ఉల్లంఘించి ఎవరైనా అనధికారికంగా రుసుము వసూలు చేస్తే కోర్టు ధిక్కరణ కింద క్రిమినల్ కేసు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సికింద్రాబాద్-కొల్లం మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు: ఓనమ్ పండగ, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 25, 27వ తేదీల్లో సికింద్రాబాద్-కొల్లం-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును నడుపుతున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25 శుక్రవారం సాయంత్రం 5.50 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ బయలుదేరిన రైలు (07119) నుంచి బయలుదేరి రాయచూర్, మంత్రాలయం, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, వైఎస్సార్ కడప, రేణిగుంట, కాట్పాడి మీదుగా శనివారం రాత్రి 11.30 కొల్లం చేరుతుంది. తిరిగి ఈ రైలు (07120) కొల్లం జంక్షన్ నుంచి ఆదివారం సాయంత్రం 7 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 11.50 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది.

ప్రజలతో కలిసుండే వాడే నాయకుడు

- ప్రజా సంక్షేమ యాత్రలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: ప్రజలతో కలిసుండే వాడే నాయకుడవుతాడని, ఈ విషయం కూడా తెలియని జేసీ ప్రభాకరరెడ్డి తన కుమారుడు అస్మిత్ రెడ్డిని రాజకీయ వారసుడిగా చూడాలని కలలు కంటున్నాడని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. బుధవారం యాడికి మండలంలో 2వ రోజు ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా ఆయన సీకే పల్లి గ్రామంలో ప్రసంగించారు. ప్రజా సమస్యలను తన సమస్యలుగా గుర్తించి, వాటికి పరిష్కారాన్ని చూపినప్పుడే ప్రజలు నాయకుడిగా గుర్తిస్తారన్నారు. కానీ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి నాయకుడిగా చలామణి అవుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి... తన రాజకీయ వారసుడిగా కుమారుడిని చూడాలని ఉబలాటపడుతూ జాకీలు పెట్టి పైకి లేపేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాడని ఎద్దేవా చేశారు. కానీ, అస్మిత్‌రెడ్డి మనసులో ఈ రాజకీయాలు తనకు సరిపోవని, తానేదో వ్యాపారాలు చేసుకుంటూ ప్రశాంతంగా జీవించాలని అనుకుంటుంటే నాన్నే తన పాలిట కుంపటిలా మారాడని మదనపడుతున్నాడన్నారు. వారాంతంలో తాడిపత్రికి వచ్చి వెళ్లే అస్మిత్ రెడ్డికి ప్రజాసమస్యలంటే ఏమిటో కూడా తెలీవన్నారు. ఎవరైనా ఆయన దృష్టికి సమస్య వివరిస్తే దాని పరిష్కారానికి తీసుకోవాల్సిన తదుపరి చర్యలు ఏమిటో కూడా తెలిదన్నారు. గతంలో తమ ఆధిపత్యం కోసం నిట్టూరు, చిక్కేపల్లిలో వర్గకక్షలను పెంచి పోషించిన జేసీ సోదరుల మూలంగా ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయన్నారు. ప్రజలు పచ్చగా ఉంటే సహించలేని నీచులు జేసీ సోదరులన్నారు. అభివృద్ధిని చూసి సహించలేని జేసీ ప్రభాకర్ రెడ్డి ఇతరుల ఇళ్లు, రోడ్లు, గుళ్లు కూలదోయిస్తాడని, మొన్నటికి మొన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ పనులను స్టే తీసుకువచ్చి మరీ అడ్డుకుని పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడని మండిపడ్డారు.

జలపాతంలో పడి యువకుడి మృతి



పాటిల్ కార్తీక్ (ఫైల్)

కణేకల్లు: స్నేహితుని పెళ్లిలో అందరూ కలసి సరదాగా గడిపారు. మూడు ముళ్లు పడగానే అంతా కలసి ఎంజాయ్ చేసేందుకు పక్కనే జలపాతం వద్దకెళ్లారు. ఊహించని పరిణామం అందరినీ విషాదంలోకి నెట్టేసింది. జలపాతం వద్ద పాచిపై కాలు పెట్టడంతో అదుపు తప్పి ఇద్దరు యువకులు ఒక్కసారిగా కింద పడ్డాడు. అందరూ చూస్తుండగానే విగత జీవులయ్యారు. ఈ ఘటనలో ఒకరు కణేకల్లు మండలానికి చెందిన వాడు కావడం గమనార్హం. వివరాలు.. మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన పాటిల్ విజయమ్మ, నాగభూషణం దంపతుల మొదటి కుమారుడు కార్తీక్ (25) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి, ఏడాదిన్నరగా ఒమన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో తనతో పాటు కలసి చదువుకున్న స్నేహితుడి పెళ్లికి హాజరయ్యేందుకు ఆదివారం సొంతూరికొచ్చాడు. తల్లిదండ్రులతో కలసి ఓ రోజంతా సరదాగా గడిపాడు. అనంతరం సోమవారం హైదరాబాద్‌లో ఉంటున్న పెద్దనాన్న కుమారుడిని పలకరించి, అక్కడి నుంచి నేరుగా మహారాష్ట్రలో తన స్నేహితుడి పెళ్లిలో పాల్గొనేందుకు వెళ్లాడు. మంగళవారం స్నేహితులందరూ కలసి సరదాగా గడిపారు. అనంతరం అదే రోజు సాయంత్రం అక్కడికి సమీపంలో ఉన్న సులిభోర్ జలపాతం వద్దకెళ్లారు. అక్కడ పాచిపట్టిన రాతిపై కాలు పెట్టడంతో కార్తీక్‌తో పాటు మరో స్నేహితుడు ధనుంజయ్ గైక్వాడ్ జారి కిందపడి, అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రుల రోదనకు అంతు లేకుండా పోయింది.

గడువులోపు భూసేకరణ పూర్తవ్వాలి : జేసీ

అనంతపురం అర్బన్: 'ప్రాజెక్టుల ఏర్పాటులో భూ సేకరణ కీలకమని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని గడువులోపు ప్రక్రియ పూర్తి చేయాలి' అని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. భూసేకరణ అంశంపై బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో చేపట్టనున్న ప్రాజెక్టులు, వాటికి అవసరమైన భూమి ఇప్పటి వరకూ ఎంత సేకరించారు. ఇంకా ఎంత సేకరించాలనే అంశాలపై ఆరా తీశారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తయితే ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతమవుతుందన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, ఆర్ అండ్‌బీ, ఏపీఐఐసీ, అహుడా, ఇతర ప్రభుత్వశాఖల కార్యాలయాలు, సంక్షేమ వసతి గృహ భవనాల నిర్మాణానికి కేటాయింపు మేరకు భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు మధుసూదన్, నిశాంత్‌రెడ్డి, రవీంద్ర, ఏపీఐఐసీ జెడ్ఎం వరప్రసాద్, హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, నెడ్‌క్యాప్ మేనేజర్ కోదండరామయ్య, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు అండగా ఉంటాం



రుణాలు అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలోని 51 మంది రైతులకు పీఏసీఎస్ చైర్మన్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వల్ప కాలిక రుణాలు, పశుపోషణకు సంభందించి రైతులకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.1.10 కోట్ల రుణాలు అందజేశామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎటు చూసినా నీరు ఉండటంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయన్నారు. రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ నారప రెడ్డి, మల్లన్న, బ్రాంచ్ మేనేజర్ స్టీఫెన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెస్తలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ

అనంతపురం టవర్‌క్లాక్: బెస్తలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బెస్త సేవా సంఘం సమావేశం నిర్వహించి, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను బెస్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంకా ఎవరైనా పథకాలు అందకపోతే సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా సచివాలయాల్లో అధికారులతో మాట్లాడి పథకాలు అమలు చేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చంద్రబాబు, బాలన్న, నాగేంద్ర, గంగప్ప, శ్రీనివాసులు, శ్రీరాములు, రమేష్, నారాయణస్వామి, నరసప్ప, ఆదినారాయణ, నారాయణమూర్తి, ధనుంజయ, రాము, పాపన్న పాల్గొన్నారు.

త్వరలో న్యాక్ టీం పర్యటన



సన్మానం అందుకున్న వర్సిటీ ప్రొఫెసర్లతో జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్ధన

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ కళాశాలలో త్వరలో న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) పీర్ కమిటీ పర్యటించనుంది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ (ఏ) అంతర్గత నాణ్యత మదింపుల కమిటీ (క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్) సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ రూపకల్పన బుధవారం పూర్తయింది. వర్సిటీ సాధించిన ప్రగతి, విద్యార్థుల అడ్మిషన్లు, కోర్సు పూర్తయిన వారికి దక్కిన కొలువులు, వర్సిటీ అందిస్తున్న ప్రామాణిక సాంకేతిక విద్య, నాణ్యమైన పరిశోధన, ముద్రించిన జర్నల్స్, వర్సిటీ ఆవిష్కరణలకు వచ్చిన పేటెంట్లు తదితర వివరాలతో సెల్ఫ్ స్టడీ రిపోర్ట్‌ను రూపొందించారు. తొలుత డిజిటల్ వెరిఫికేషన్ అనంతరం నేరుగా న్యాక్ టీం వర్సిటీని సందర్శించనుంది. గత రెండు సంవత్సరాలుగా రిపోర్ట్‌ను రూపకల్పన చేయడానికి కృషి చేసిన ప్రొఫెసర్‌లను వీసీ రంగజనార్ధన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ సత్కరించారు.

బీసీ హాస్టల్ వార్డెన్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం రూరల్: బీసీ వసతి గృహాల వార్డెన్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా కుల్లాయిస్వామి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్‌నాయుడు, గౌరవాధ్యక్షుడిగా మారుతీప్రసాద్, సలహాదారుగా వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా రవీంద్రనాథ్ ఠాగూర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కంబయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారిని సన్మానించారు.

రక్షక తడులతో పంటలకు మేలు

రాప్తాడు: వర్షాధారం కింద పంటలు సాగు చేసిన రైతులు రక్షక తడులతో పంటలు కాపాడుకోవాలని ఆర్డీటీ ఎఫ్ ఏకాలజీ ఏటీఎల్ ఇంద్రజ పేర్కొన్నారు. మండలంలోని రామినేపల్లి, ఎం.బండమీదపల్లి, భోగినేపల్లి గ్రామాల్లో ఎస్ఎంజీ గ్రూపులో రైతులు సాగు చేసిన ఆముదం, కంది పంటలకు ట్యాంకర్ల ద్వారా రక్షక తడులు అందించారు. కార్యక్రమంలో ఏ ఎఫ్ ఎకాలజీ టెక్నికల్ అసిస్టెంట్ విష్ణువర్ధన్, సీబీఓ అసోసియేట్ రామకృష్ణ, ఏఈపీ లోకేశ్వరి, ఎస్‌టీఓ శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు చెక్

నగరంలోని మరువవంక వెళ్లే 13, 14 డివిజన్ల పరిధిలోని ఉమానగర్‌లో బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. వర్షాలు వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరేది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. త్వరలో కాలనీవాసుల కష్టాలు తీరనున్నాయి. ఈ ప్రాంతంలో కొత్తగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు ఆర్డీటీ ముందుకొచ్చింది. రూ.60 లక్షల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి

- ఉమానగర్‌లో బ్రిడ్జి నిర్మాణానికి ముందుకొచ్చిన ఆర్డీటీ
- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన మైనర్ ఇరిగేషన్ అధికారులు
- 26న ప్రారంభం కానున్న పనులు

అనంతపురం క్రైం: నగరంలోని మరువవంకకు మహర్దశ పట్టనుంది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించేందుకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) ముందుకొచ్చింది. ఇందుకోసం రూ.60 లక్షలు వెచ్చించనుంది. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే వాటర్ రీసోర్స్ డిపార్ట్‌మెంట్ మైనర్ ఇరిగేషన్ ఐబీ డివిజన్ ఇంజినీర్ ఈ నెల 21న గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అదే రోజున బ్రిడ్జ్ నిర్మాణ పనులకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ భూమి పూజ చేశారు. ఈ నెల 26న ఆర్డీటీ ఆధ్వర్యంలో బ్రిడ్జి పనులు ప్రారంభించనున్నారు.

శాశ్వత పరిష్కారం..

నగరంలోని మరువవంక వెళ్లే 13, 14 డివిజన్ల పరిధిలోని ఉమానగర్‌లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఆ సమయంలో స్థానిక ప్రజలు బ్రిడ్జి ఏర్పాటు చేయాలని మొరపెట్టుకున్నారు. శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి పక్కన 150 కుటుంబాల వరకూ నివాసం ఉంటున్నారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ముంపునకు శాశ్వత పరిష్కారం చూపేలా చేపట్టాల్సిన చర్యలపై అక్కడే ఉన్న నగరపాలక సంస్థ కమిషనర్, ఇతర అధికారులతో చర్చించారు. బ్రిడ్జ్ నిర్మాణానికి సహకరించాలని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌కూ విజ్ఞప్తి చేశారు. దీంతో బ్రిడ్జి ఏర్పాటుకు ఆర్డీటీ అంగీకరించింది. ఈ నెల 19న ఎమ్మెల్యే మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. ఈ నెల 21న మైనర్ ఇరిగేషన్ అధికారులు బ్రిడ్జి నిర్మించేందుకు ఆర్డీటీకి అనుమతులిచ్చారు.

చాలా సంతోషం..



మా ఇంటి సమీపంలోని చిన్న బ్రిడ్జి ఒక వైపు పూర్తిగా పడిపోయింది. అటుగా వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉంటుంది. ఇక వర్షం వస్తే మా అవస్థలు దేవునికెరుక. ఏ సమయంలో వరద నీరు ఇంట్లోకి వస్తుందోనని భయాందోళనతో ఉండేవాళ్లం. ప్రస్తుతం బ్రిడ్జి ఏర్పాటు చేస్తున్నారని తెలిసింది. సమస్య పరిష్కారం కానుండటంతో సంతోషంగా ఉంది.

– రేణుకా, ఉమానగర్

రక్షణ గోడలు ఏర్పాటు చేయిస్తాం

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి బ్రిడ్జితో పాటు రక్షణ గోడలు ఏర్పాటు చేయిస్తాం. బ్రిడ్జి నిర్మాణానికి ఆర్డీటీ ముందుకు రావడం సంతోషదాయకం. ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌కు ఉమానగర్ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు.

– అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే

చంద్రయాన్-3 విజయగీతిక



అనంతపురం: సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం తదితరులు

రాప్తాడురూరల్: 'ఇస్రో' శాస్త్రవేత్తలు నింగిపైకి పంపిన చంద్రయాన్-3 జాబిల్లిపై సాఫ్ట్‌గా ల్యాండింగ్ అయిన క్షణాన దేశవ్యాప్తంగా ఒక్కసారిగా జయహో చంద్రయాన్-3 నినాదం మారుమోగింది. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా నలుమూల సంబరాలు అంబరాన్నంటాయి.

అనంతపురం: అంతరిక్ష చరిత్రలో భారత్ సరికొత్త అధ్యాయం లిఖించింది. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ఎమ్మెల్యే అనంత వెంకట్రామి రెడ్డి తన స్వగృహంలో కేక్ కట్ కట్ చేసి మిఠాయిలు పంచారు. 'జయహో' భారత్ అంటూ నినదిస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం సలీం, ఏపీ మైనార్టీల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్ బేగ్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంట మధు, ఆలుమూరి శ్రీనివాస రెడ్డి, కార్పొరేటర్ సంపంగి రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రాత్మక ఘట్టం



చంద్రయాన్-3 విజయవంతం అనేది భారత్ అంతరిక్ష రంగంలో ఒక సువర్ణ అధ్యాయం. ఇది అంతరిక్ష రంగంలో మన ఉన్నతిని అగ్ర రాజ్యాల తరపున నిలబెట్టింది. మన దేశ శాస్త్రవేత్తలు ఏ దేశానికి తీసిపోరని రుజువు చేశారు. ఈ విజయం ఒక చరిత్రాత్మక ఘట్టం.

– కరణం సుధాకర్, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు

దేశానికే గర్వకారణం



అంతరిక్షంలో భారత్ గర్జించింది. ఏ దేశానికి సాధ్యం కాని దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టి అంతరిక్ష చరిత్రలో సరికొత్త అధ్యాయం సృష్టించింది. చంద్రయాన్-3 విజయవంతం కావడం మన దేశానికి గొప్ప గర్వకారణం. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో యావత్ భారతావని పులకించింది.

– నరసమ్మ, ప్రిన్సిపాల్, కేజీబీవీ కనగానపల్లి

శాస్త్రవేత్తలకు సెల్యూట్



ఎట్టకేలకు భారత్ అనుకున్నది సాధించింది. ఎంతో మంది శాస్త్రవేత్తలు అహర్నిశలు కష్టపడి సాధించిన గొప్ప విజయం ఇది. రెండుసార్లు విఫలమైనా.. అందులోని లోటుపాట్లను సవరించుకుని నూతన ఉత్తేజంతో అనతికాలంలోని విజయం సాధించారు. భారత్ సత్తా ఏమిటో ఈరోజు ప్రపంచానికి తెలిసింది.

– చందన డిగ్రీ విద్యార్థిని, అనంతపురం

శాస్త్రవేత్తల గొప్ప విజయం



చంద్రయాన్-3 సక్సెస్ కావడంతో మన ఇస్రో శాస్త్రవేత్తలు గొప్ప విజయం సాధించారు. దీనికి ప్రతి భారతీయ పౌరుడు గర్వపడాలి. ఇలాంటి ప్రయోగాలతో భారత దేశం రోదసీ యానంలో మరింత ముందుకెళ్తుంది. ప్రపంచ దేశాల్లోనే అగ్రగామిగా నిలవబోతుంది.

– రవికిరణ్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్ కనగానపల్లి

'ఇస్రో సరికొత్త అధ్యాయం లిఖించింది'

- చంద్రయాన్-3 విజయంపై సంబరాలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం కల్చరల్: భారత్ మాతాకీ జై.. వందే మాతరం అంటూ ఆర్యవైశ్య సంఘం నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బుధవారం రాత్రి నగరంలో సందడి చేశారు. పాతూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతీయ జండాలతో శాంతి ర్యాలీ చేస్తూ శాస్త్రవేత్తలకు దేశ ప్రధాని మోదీకి జేజేలు పలికారు. విశ్వహిందూ పరిషత్, ఇతర హిందూ సంస్థల ప్రతినిధులు మాజీ విరసం సభ్యులు జెట్టీ జైరామ్, అనంత జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

రాప్తాడు: చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ ప్రత్యక్ష ప్రసారాన్ని గొల్లపల్లి గ్రామ సమీపంలోని మాంటిస్సోరి ఎలైట్ పాఠశాల విద్యార్థులు వీక్షించారు. చంద్రయాన్ విశిష్టతలను ఆ పాఠశాల ఎండీ భరత్ కృష్ణ, కరస్పాండెంట్ సమీరా వివరించారు.

కనగానపల్లి: చంద్రయాన్-3 విజయవంతం కావటం భారతీయులంతా గర్వపడే విషయమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవికిరణ్ తెలిపారు. బుధవారం సాయంత్రం జరిగిన చంద్రయాన్-3 రోదసి నౌక ప్రయోగాన్ని స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు స్మార్ట్ టీవీల ద్వారా వీక్షించారు. చంద్రుడిపై వ్యోమనౌక విక్రమ్ ల్యాండింగ్ కాగానే సంబరాలు చేసుకొన్నారు. కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారని ప్రిన్సిపాల్ నరసమ్మ తెలిపారు.

ఆకట్టుకున్న స్టాల్స్



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

అనంతపురం క్రైం: ప్రభుత్వ వైద్య కళాశాల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ శ్రీదేవి స్టాల్స్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మెడికోలు ఫుడ్‌స్టాల్, జ్యూక్ బాక్స్, గేమింగ్ స్టాల్స్, రోజ్ స్టాల్స్, ఓనమ్ పండుగ స్టాల్స్ తదితర 20 స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లు, 2కే-19, 2కే-20, 2కే-21, 2కే-22 వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

ఆత్మకూరు: పంపనూరులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొనసాగిన ఈ ప్రక్రియలో రూ.16,21090 సమకూరినట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి, పాలక మండలి చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం



మరూరులో ఆర్బీకేను ప్రారంభించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

రాప్తాడు: సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి ఎమ్మెల్యే మండలంలో పర్యటించారు. ఉదయం 10 గంటలకు ప్రసన్నాయపల్లి (చిన్మయ నగర్)లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, 11 గంటలకు మండల కేంద్రం రాప్తాడులో జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. అలాగే 11:30 గంటలకు మండల కేంద్రం 44వ జాతీయ రహదారి సమీపంలో నిర్మించిన సచివాలయ భవనం-2ను ప్రారంభించారు. అనంతరం మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో పర్యటించారు. మధ్యాహ్నం 12 గంటకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, మరూరులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేసి అమలు చేశారన్నారు. సచివాలయ ఉద్యోగుల ఎంపికలో కూడా ఎలాంటి పైరవీలకు అవకాశం లేకుండా 1.40 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఇంత పెద్ద వ్యవస్థ ఏర్పాటైన తర్వాత చిన్న చిన్న సమస్యలు తలెత్తడం సహజమే అన్నారు. వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు సాగాల్సి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారన్నారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి ఆర్థిక భరోసా దక్కుతోందని పేర్కొన్నారు. నవరత్నాల్లోని పథకాలతో ప్రతి గడపలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, నియోజకవర్గ మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్ రెడ్డి, బుక్కచెర్ల సొసైటీ అధ్యక్షుడు మాచినేని కొండా రెడ్డి, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజినేయులు, మన్నల వరలక్ష్మి, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిట్రా వెంకటేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, పండమేటి రాయుడు ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి రాముడు, కాంట్రాక్టర్ రమణా రెడ్డి, సర్పంచులు శశికళ, సాకే తిరుపాలు, ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, విజయ్ వర్ధన్ రెడ్డి, సాకే చంద్ర, జయన్న, చిరుతల నాగేంద్ర, రామచంద్రారెడ్డి, మాచినేని చెన్నారెడ్డి పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ శ్రీనివాసులు ఆదేశం
- ఉద్యోగుల స్పందనకు 31 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ శ్రీనివాసులు

అనంతపురం అర్బన్: ఉద్యోగులు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ఉద్యోగుల ప్రత్యేక స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 31 వినతులు అందాయి. ఇన్‌చార్జ్ డీఆర్‌ఓతో పాటు డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, పరిపాలనాధికారి శ్రీధర్ స్వయంగా అర్జీలు స్వీకరించి, పరిశీలించారు. అనంతరం ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యను పరిష్కరించడంతో పాటు సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

కల్యాణం.. కమనీయం



అనంతపురం కల్చరల్: శ్రావణ మాసం పర్వదినాలను పురస్కరించుకుని అనంతపురంలోని వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న శిరిడి సాయినాథ మందిరంలో బుధవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. నిర్వాహకులు మణూరు నాగరాజు నేతృత్వంలో పండితులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు గోవింద నామస్మరణతో హోరెత్తించారు. భక్తిగీతాలు ఆలపించారు. విష్ణు సహస్రనామ సత్సంగం మార్మోగించారు. అనంతరం స్వామి వారికి నివేదించిన మహాప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జయచంద్రచౌదరి, విజయ్‌కుమార్, నాగానందం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వేగేట్ బంద్

అనంతపురం సిటీ: అనంతపురం-ధర్మవరం మార్గంలోని చిగిచెర్ల-జంగాలపల్లి మధ్యలోని రైల్వే గేట్‌ను మూడ్రోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే లైన్ మరమ్మతులతో పాటు నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గురువారం నుంచి శనివారం వరకు తాత్కాలికంగా గేట్‌ను మూసివేస్తామన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగించాలని సూచించారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి



గోవింద్ రెడ్డి (ఫైల్)

రాప్తాడు: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గాండ్లపర్తి గోవింద్ రెడ్డి (59) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గోవింద్ రెడ్డి వృత్తిరీత్యా వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. బుధవారం ఉదయం కూడా యధావిధిగా వ్యవసాయ తోటలోకి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. తోటలో పనులు చేస్తూ మధ్యాహ్నం 12:30 గంటలకు స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమార్తె ఉన్నారు.

రేషన్ సరఫరాలో అలసత్వం వద్దు

రాప్తాడురూరల్: పౌరసరఫరాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని అనంతపురం తహసీల్దార్ శ్రీధరమూర్తి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం మండలస్థాయి విజిలెన్స్ (ఆహార సలహా) సంఘం సమావేశం జరిగింది. సమావేశానికి సంఘం కో-చైర్‌పర్సన్, ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, సభ్యులు, జెడ్పీటీసీ చంద్రకుమార్, డెప్యూటీ తహసీల్దార్ రాజా, సీఎస్‌డీటీలు దుర్గాప్రసాద్, బాషా, ఎంఈఓ వెంకటస్వామి, ఇతర అధికారులు హాజరై వివిధ అంశాలపై చర్చించారు. ఈ అంశాలను వచ్చే సమావేశం నాటికి పరిష్కరించేలా చూడాలని జెడ్పీటీసీ సభ్యుడు కోరారు. సంఘం చైర్మన్, తహసీల్దార్ శ్రీధరమూర్తి మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు అందాల్సిన సేవల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించమన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దని కోరారు. ముఖ్యంగా ఎండీయూ ఆపరేటర్లపై రేషన్ సరుకుల పంపిణీలో అక్కడక్కడ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ మాట్లాడుతూ.. కొందరు ఎండీయూ ఆపరేటర్లు చక్కెరకు సంబంధించి రూ.3 అదనంగా వసూలు చేస్తున్నారని విచారించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఆంధ్రకేసరి ఆశయాలు కొనసాగిద్దాం

అనంతపురం: స్వాతంత్య్ర సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు అడుగుజాడల్లో నడుద్దామని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగ జనార్ధన అన్నారు. బుధవారం ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పని చేసి ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, సుమలత, ఈశ్వర్‌రెడ్డి, శోభ బిందు, సుబ్బారెడ్డి, సురేష్‌బాబు, పద్మ సువర్ణ, వీబీ చిత్ర, చంద్రమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, ఏపీ శివకుమార్, పీఆర్‌ఓ రామశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో..

ఎస్కేయూ క్యాంపస్ ప్రిన్సిపల్ చాంబర్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణకుమారి హాజరై ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చిట్టా సురేష్, కన్వీనర్ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయంలో..

కేంద్ర గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ, ఇంతియాజ్ అహ్మద్, జీఎం బాష, శ్రీవిజయ, సరస్వతి, బాలచంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, తదితరులు

అనంతపురం క్రైం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకున్ని ప్రజలకు మెరుగైన సేవలందించాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. బుధవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించిన ప్రకాశం పంతులు అంచెలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎస్ఈ నాగమోహన్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూఏలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ జింకా రంగ జనార్దన

అనంతపురం కల్చరల్: స్వాతంత్య్ర సమరయోధుడిగా, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విశేష సేవలందించారని ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బ్రాహ్మణ సంఘం నాయకులు అరుణ్, శ్రీనివాస్, ప్రకాష్, రామబ్రహ్మంతో కలసి బుధవారం రామనగర్‌లోని టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1928లో సైమన్ కమీషన్ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని బ్రిటిషర్లను ఎదురించారన్నారు. ఏనాడు పదవుల కోసం ఆశించకుండా త్యాగాలు చేసి చిరస్మరణీయుడయ్యారని కొనియాడారు.



ఆచంద్ర తారార్కం ఈ మహిళల కీర్తి

'ఇస్రో'లో పనిచేసిన తొలి తరం మహిళా శాస్త్రవేత్తల మాటల్లో తరచు వినిపించే మాట... 'ఆరోజుల్లో ఇస్రోలో చా...లా తక్కువ మంది మహిళలు ఉండేవారు' చంద్రయాన్-3కి సంబంధించి నిన్నటి ప్రత్యక్ష ప్రసారాన్ని గమనిస్తే... ఆ ప్రాజెక్ట్‌లో భాగమైన ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉత్సాహంగా కనిపిస్తారు. మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. అది సంఖ్యాబలమే కాదు సామర్థ్య బలం కూడా. 'ఇస్రో' సాధించిన ఎన్నో విజయాలలో మహిళా శాస్త్రవేత్తలు భాగం అయ్యారు. ముఖ్యంగా 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్‌లో రీతూ కరిధాల్ నుంచి కల్పనా కాళహస్తి వరకు ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు మేధోశ్రమ చేశారు. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నారు. 'ఇస్రో సైంటిస్ట్ కావాలనుకుంటున్నాను' అని కలలు కనే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చే అసాధారణ విజయ గాథలు ఇవి.

రాకెట్ ఉమన్: రీతూ కరిధాల్



అన్ని దశలను పూర్తి చేసుకొని విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన క్షణం ఒక చారిత్రక సందర్భం. ఎంత కృషి చేస్తే ఒక విజయం సొంతం అవుతుందో చెప్పిన సందర్భం.

అమోఘమైన చారిత్రక విజయాన్ని దేశానికి అందించిన 'చంద్రయాన్-3'లో భాగమైన అనేకమంది మహిళలలో రీతు కరిధాల్ ఒకరు.

గత నెలలో...

మూడు దశలను పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి దూసుకెళ్లిన తరువాత ఉత్తర్‌ప్రదేశ్‌లో లక్నోలోని ఒక ఇంట్లో ఆనందం అంబరాన్ని తాకింది. వారు ఆనందంతో బాణాసంచా కాల్చారు. మిఠాయిలను చుట్టుపక్కల వారికి పంచారు. ఇక నిన్నటి రోజు ఆ ఆనందం స్థాయి ఎల్లలు దాటి ఉండవచ్చు. ఇది కోట్లాదిమంది భారతీయుల ఇంట్లో కనిపించే సాధారణ దృశ్యమే కావచ్చు.

కాని ఆ ఇంటికి ఒక ప్రత్యేకత ఉంది.

ఆ ఇంట్లో పుట్టిన రీతూ కరిధాల్ ప్రసిద్ధ చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు ఆకాశం అంటే అంతులేని ఆసక్తి. అదేపనిగా నింగిలోకి చూసేది. ఏవేవో ఊహించుకునేది. అప్పటికి అవి శాస్త్రీయతకు నిలవని ఊహలు కావచ్చు. అయితే రీతూ కరిధాల్ శాస్త్రీయ రంగంలో దిగ్గజంగా వెలగడానికి ఉపకరించిన ఊహలు.

కట్ చేస్తే....

1997... భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోకి అడుగు పెట్టింది రీతు. చంద్రుడిపై అడుగు పెట్టినంత ఆనందంగా అనిపించింది. 'ఇస్రో' గురించి వింటూ, చదువుతూ పెరిగిన రీతు అదే 'ఇస్రో'లో 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో ఉద్యోగిగా చేరింది. అప్పట్లో 'ఇస్రో'లో తక్కువ మంది మహిళలు పనిచేసేవారు.

ఎక్కడికి వెళ్లినా ఒంటరిగానే వెళ్లేది. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది.

అయినా సరే, ఎప్పుడూ భయపడేది కాదు.

అసలు సిసలు భయం మాత్రం తొలి టాస్క్ రూపంలో ఎదురైంది.

'నేను చేయగలనా?' అని మొదట ఆందోళన పడింది రీతు.

చేతులెత్తేయడం తేలిక. 'చేయగలను' అనుకోవడం కష్టం. అయితే కష్టపడే వారే విజేతలవుతారు. 'యస్ నేను చేయగలను' అంటూ తొలి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేసి 'భేష్' అనిపించుకుంది.

'నాకు అప్పగించిన టాస్క్‌ను సీనియర్‌లు చేసే అవకాశం ఉన్నప్పటికీ నన్ను వెదుక్కుంటూ వచ్చింది. ఇది నన్ను పరీక్షించడానికి వచ్చిందా? అదృష్టవశాత్తు వచ్చిందా? అనేది తెలియదుగానీ నా విజయానికి కారణం... ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ చదువుకున్నాననే ధైర్యం కంటే నాపై నాకు ఉన్న ఆత్మవిశ్వాసం' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది రీతు.

ఆ ఆత్మవిశ్వాసం అప్పుడే కాదు ఇప్పటికీ రీతు వెన్నంటే ఉంది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రతిష్ఠాత్మకమైన 'మంగళయాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేయడానికి ఇంధనంగా మారింది. చంద్రయాన్-3తో రీతూ కరిధాల్ ఒక చారిత్రక విజయంలో భాగం అయింది.

శాస్త్రవేత్తలు కావాలనుకునే కలలు కనే అమ్మాయిలకు రీతు కరిధాల్ స్ఫూర్తి ఇస్తుంది.

'నా విజయ మంత్రం ఇది' అని ఆమె ఎప్పుడూ ప్రత్యేకంగా చెప్పలేదుగానీ పరోక్షంగా వినిపించే మాట...టైమ్ మేనేజ్‌మెంట్.

కాలం విలువ తెలిసిన వారే 'టైమ్ మేనేజ్‌మెంట్'ను ఇష్టంగా ఆచరిస్తారు. ఆ ఆచరణే ఎన్నో విజయాలను బహుమానంగా ఇస్తుంది.

స్ఫూర్తిదాయక శక్తిమంతులు



మహిళా శాస్త్రవేత్తలు, సిబ్బంది వేడుక

స్పేస్ మిషన్‌లలో భాగమైన మహిళా శాస్త్రవేత్తల గురించి మిన్నీ వేద్ 'దోజ్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ స్టోరీస్' అనే స్ఫూర్తియదాయకమైన పుస్తకాన్ని రాసింది. ఈ పుస్తకంలో 'రాకెట్ ఉమెన్'గా పేరు గాంచిన రీతూ కరిధాల్ సక్సెస్ స్టోరీ కూడా ఉంది. 'కుటుంబ జీవితం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాను. వృత్తిపరమైన విజయాలకు కుటుంబమే పెద్ద బలం' అంటుంది రీతు.

'ఇస్రో'లో రీతులాగే ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నతస్థానాల్లో ఉన్నారు. అయితే ఇది రాత్రికి రాత్రి వచ్చిన విజయం కాదని వారి ప్రయాణాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'ఇస్రో'లో పనిచేయాలని అనుకోవడానికి కారణం నుంచి... ఎదుర్కొన్న ఒత్తిళ్ల వరకు వారి మాటల్లో కనిపిస్తాయి.

ఇస్రో స్పేస్ సైన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పని చేసిన సీతా సోమసుందరం ఇలా అంటోంది...

'నేను ఇస్రోలో చేరిన కాలంలో ఇంజనీరింగ్, సైన్స్‌లలో మహిళలు చాలా తక్కువ మంది ఉండేవాళ్లు. కొందరు సీనియర్‌లకు కొన్ని అభిప్రాయాలు ఉండేవి. అందులో ఒకటి... మహిళలు ఎక్కువగా కష్టపడలేరు. పరిమిత పని గంటల్లోనే పనిచేయగలరు. ఇంటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అంకితభావం ఉండదు. అయితే ఇది తప్పుడు భావన అని ఇస్రోలో ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు నిరూపించారు'. 'ఏదో ఉద్యోగం చేస్తున్నాను అనే భావన కాకుండా విజయంలో భాగం కావాలనే సంకల్ప బలం మహిళా శాస్త్రవేత్తలలో కనిపిస్తుంది. ఎన్నో విజయాలలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించారు. డెడ్ లైన్‌లను సవాలుగా తీసుకోవడం నుంచి మిషన్, నేవిగేషన్, కమ్యూనికేషన్, కంట్రోల్ సిస్టమ్, స్పేస్ క్రాఫ్ట్ డిజైన్, ట్రాకింగ్ లాంటి మేజర్ ఏరియాలలో కీలక పాత్ర పోషించి తమ సత్తా చాటారు' అంటుంది మంగళ్‌యాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన ఎస్.అరుణ. స్పేస్ సైంటిస్ట్‌లు అనగానే ఏవో గంభీరమై ఊహలు తారసపడతాయి. అయితే ఈ ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల మాటలు విన్న తరువాత 'అందరిలాగే సాధారణ జీవితం... కానీ అసాధారణ సంకల్ప బలం' అనే సత్యం ఆవిష్కారం అవుతుంది. 'ఇస్రోకు చైర్ ఉమన్ (చైర్ పర్సన్) ఎప్పుడూ?' అనే ప్రశ్న వస్తుంటుంది. 'ఇస్రో' విజయాలలో భాగం అవుతున్న మహిళల అంకితభావాన్ని చూస్తే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదు' అనిపిస్తుంది. 'ఇస్రో'లో జెండర్-న్యూట్రల్ ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ ఉంటుందనే మంచి మాటలు కూడా దీనికి కారణం.

కొన్నిసార్లు లోతైన భావాలు పలకడానికి పదాలు, పుస్తకాలు తెల్లముఖం వేస్తాయి. కళ్లు మాత్రమే నిశ్శబ్దంగా చెబుతాయి. చంద్రయాన్-3 ల్యాండింగ్‌కు సంబంధించి నిన్నటి టీవీ ప్రత్యక్ష ప్రసారంలో మహిళా శాస్త్రవేత్తల కళ్లలో కనిపించిన ఉత్సాహాన్ని, అంకితభావాన్ని గమనిస్తే ఇంకా ఎన్నో విజయాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయని అనిపిస్తుంది.

సంతోష క్షణాలు: కల్పనా కాళహస్తి



కల్పనా కాళహస్తిది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా. చెన్నైలో బి.టెక్ (ఈసీఈ) చదివారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి. తల్లి గృహిణి. ఇస్రోలో పనిచేయాలని తన చిన్ననాటి నుంచి కలలు కనేది. అనుకున్నట్టుగానే 2000 సంవత్సరంలో ఇస్రోలో చేరారు. తొలుత శ్రీహరికోటలో ఐదేళ్లు పనిచేశాక బెంగళూరులోని శాటిలైట్ సెంటర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరోనా పాండమిక్ సమయంలో అనేక అవాంతరాలు వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ 'చంద్రయాన్-3' మిషన్‌లో అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె గతంలో చంద్రయాన్-2, మంగళయాన్ ప్రాజెక్టుల్లోనూ కీలక బాధ్యతల్ని నెరవేర్చారు. ఆమె నైపుణ్యం, అంకితభావం, దూరదృష్టి వంటివి మిషన్ విజయవంతం కావడంతో గణనీయంగా తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇవి చాలా సంతోషభరితమైన క్షణాలుగా ఎప్పటికీ ఉండిపోతాయి. చంద్రయాన్ 2 కాలం నుంచి లభ్యమైన ఎన్నో అనుభవాలతో ఈ మిషన్‌ను లోప రహితంగా రూపొందించాం అని చెప్పారు.

వినిపించే గొంతుక: పి.మాధురి



శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ నుంచి ప్రజలకు బయటికి కనపడే అక్కడి సిబ్బంది/ సైంటిస్టుల్లో పిల్లల మాధురి ఒకరు. ఈమె షార్‌లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రాకెట్ లాంచింగ్ సమయంలో వినిపించే వ్యాఖ్యానాలు, ప్రజలకు వివరించే అంశాల గొంతుక ఆమెదే.

వీళ్లే కాకుండా చంద్రయాన్-3 మిషన్‌లో మొత్తం 54 మంది మహిళా సైంటిస్టులు / ఉద్యోగులు / సిబ్బంది ఉన్నారు. వీళ్లలో చాలా మంది మహిళలు ఎంతో కీలకమైన బాధ్యతలు నెరవేర్చే డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయి నుంచి అనేక స్థాయుల్లో పనిచేస్తూ... కీలకమైన, భారత్‌కు గర్వకారణమైన ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారు.

సౌమ్యంగా సాధించింది



సౌమ్య ఈ తరం టెకీ. సాంకేతికతను ఆరోగ్యానికి అద్దింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో కొత్త ఒరవడి తెచ్చింది.

వైద్యరంగం, ఔషధాల తయారీ రంగాలు సాంకేతికతను అందుకోవాల్సినంత వేగంగా అందుకోవడం లేదనుకుంది సౌమ్య. 'మల్టిప్‌లెయెర్ ఏఐ' పేరుతో హెల్త్‌కేర్ రంగంలో ప్రవేశించింది. ఇంత సునిశితమైన, సంక్లిష్టమైన పరిశ్రమను నిర్వహించడం మగవాళ్లకే సాధ్యం అనే అభిప్రాయాన్ని చెరిపేసిందామె. 'మగవాళ్ల ప్రపంచం అనే భావన మహిళలు ప్రవేశించేటంత వరకే. ఒకసారి మహిళలు ప్రవేశిస్తే ఇక అది అపోహ మాత్రమేనని నిర్ధారణకు వచ్చేస్తాం. మా టీమ్ లో సగానికి పైగా మహిళలే. సేల్స్ విభాగంలో కూడా మహిళలు సమర్థంగా పని చేస్తున్నార'ని చెప్పింది. ఒక టెకీ హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి దారితీసిన పరిస్థితులను, హైదరాబాద్‌లో సంస్థ స్థాపించి సక్సెస్ అందుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు సౌమ్య.



సౌమ్య

భారీ మూల్యం చెల్లించాం

''నన్ను హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి రప్పించిన కారణాలు అత్యంత బాధాకరమైనవి. మాది ఉత్తరప్రదేశ్, ప్రయాగరాజ్ (అలహాబాద్). నాన్న రవిప్రకాశ్ శ్రీవాస్తవ ఐఏఎస్ ఆఫీసర్. నాన్న డయాబెటిస్‌తో బాధపడుతుండేవారు. రొటీన్ టెస్టులు, మెడికేషన్ ఇవ్వడంలో ఎక్కడో పొరపాటు జరిగిపోయింది. మా జీవితాలు భారీ మూల్యం చెల్లించుకున్న పొరపాటు అది. వైద్యుల నిర్లక్ష్యం, రాంగ్ మెడికేషన్ కారణంగా ఆయన హఠాత్తుగా ప్రాణాలు వదిలారు. నేనప్పుడు బీటెక్ సెకండియర్‌లో ఉన్నాను. ఆ తర్వాత కొద్దిసంవత్సరాల్లోనే అమ్మకు ఒవేరియన్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. మేము తెలుసుకునేటప్పటికే వ్యాధి మూడవ దశకు చేరింది. చికిత్స మొదలు పెట్టినప్పటికీ ఆరు నెలలకే అమ్మను కూడా కోల్పోయాను. అలాంటి దయనీయమైన పరిస్థితుల్లోనే బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీలో బయోటెక్నాలజీలో మాస్టర్స్ చేశాను. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ వైద్యరంగం ఆ వేగాన్ని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోంది. ఆ వెనుకబాటు తెచ్చిన నష్టంలో మా అమ్మానాన్నల మరణాలు కూడా భాగమేననిపించింది. ఈ రెండు రంగాల మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలనే సంకల్పం కలిగింది, చేయగలననే నమ్మకం కూడా. సమాచారలోపం తలెత్తని విధంగా మెడికల్ డాటాను పరిరక్షించగలిగే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నాను. మల్టిప్‌లెయెర్ ఏఐ స్థాపించి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా డాటా అనలైజేషన్, డాటా మెయింటెయిన్ చేస్తున్నాం. మా సంస్థకు 'ఐఎస్ఓ 27001' సర్టిఫికేట్ వచ్చింది. మా సర్వీస్‌ను దేశవిదేశాల్లో పెద్ద ఆరోగ్య సంస్థలు తీసుకుంటున్నాయి. పేషెంట్ కేర్‌లో మొదటిది పేషెంట్ ఆరోగ్య చరిత్ర, క్రమం తప్పని పరీక్షల ద్వారా వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, పరీక్షల నివేదికల నిర్వహణ ప్రధానమైనవి. ఇక్కడ పొరపాటు జరిగితే ప్రాణాలు దక్కవని చెప్పడానికి మా పేరెంట్సే ఉదాహరణ.

ఫాలో అప్ సర్వీస్

వ్యాధి నిర్ధారణ ఆధారంగా వైద్యం అందించిన తర్వాత తదనంతర పరీక్షలను, వైద్యాన్ని అందించాల్సిన సమయానికి ఫాలో అప్ చేయడం కూడా మా సర్వీస్‌లో భాగంగా ఉంది. అలాగే భవిష్యత్తులో టెలిమెడిసిన్ విస్తరించాల్సిన అవసరం ఉంది. వైద్యచికిత్సను కుగ్రామాలకు చేరడానికి చక్కటి మాధ్యమం ఇది. పేషెంట్‌ను ఉన్న చోటనే ఉంచి ఆరోగ్యపరిస్థితిని మానిటర్ చేయడం సాధ్యమవుతుంది. నేను చదివిన టెక్, బయోటెక్ పరిజ్ఞానం ఇందుకు దోహదం చేసింది. నాకు సవాళ్లు ఎదురయ్యాయా అంటే సవాళ్లు లేని ప్రొఫెషన్ అంటూ ఏదైనా ఉంటుందా? డిజిటల్ బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవరోధాలు వచ్చాయి. మా క్లయింట్ల సందేహాలను తీరుస్తూ, వాళ్లు సమాధానపడే వరకు సహనంగా వివరించాం. సవాళ్లకు సమాధానాలు వెతుక్కుంటూ ముందుకు పోవడమే సక్సెస్‌కు దారి తీస్తుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మా నాన్నను కోల్పోవడమే నన్ను ఈ రంగం వైపు నడిపించింది. ప్రతి విజయంలో మా అమ్మానాన్న కనిపిస్తున్నారు'' అని వివరించారు సౌమ్య.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అబద్ధాలను నమ్ముతున్నారా?!



సైబర్ టాక్

నిజం నిలబడి ఉండగానే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందంటారు.. ఈ సామెత సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా పుట్టుకువచ్చే ఫేక్‌న్యూస్ విషయంలో సరిగ్గా సరిపోలుతుంది. ఈ ఫేక్ న్యూస్ వల్ల నిజమేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. అబద్ధాన్ని నిజం అనుకునే ప్రమాదమూ ఉంటోంది. అలాగే.. ఫొటోలు, వీడియోలు కూడా ఫేక్‌వి పుట్టుకొస్తున్నాయి. లైవ్ వీడియోలోనూ ఇటీవల ఏఐ టెక్నాలజీ ద్వారా అబద్ధం కొత్తగా సోషల్‌మీడియాను ఏలుతోంది. నిజమేంటో తెలుసుకోవడానికి మనం చాలా ప్రయత్నాలు చేయాల్సి ఉంటోంది. ఎందుకంటే, అబద్ధాల వల్ల కలిగే మోసాలు ఎన్నో. వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలంటే ముందుగా నిజాలేమిటో తెలుసుకుందాం...

వార్తలకు సంబంధించిన సమాచారం, డేటా, నివేదికలు పూర్తిగా నిజమైనవి కానివి ప్రజల ముందుకు వస్తున్నాయి. అందుకని, మూలాధారాలు లేకుండా వచ్చిన సమాచారం అవాస్తవం అని గ్రహించాలి. అబద్ధపు వార్తలు విస్తృతంగా షేర్ అవుతుంటాయి. వీటికి ఎలాంటి సెన్సార్‌షిప్ ఉండదు.

నకిలీ వార్తల పుట్టుకకు..

తమకు తెలిసిన విషయాన్ని నలుగురికి తెలియజేయాలనే ఆత్రుత. స్వీయ లాభం, రాజకీయ ప్రభావం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. కేవలం తమకు తెలిసినవి మరికొందరికి తెలియజేద్దామని నిజానిజాలు తెలుసుకోకుండా కొందరు అదేపనిగా షేర్ చేస్తుంటారు. సమాచారం అబద్ధమే కావచ్చు కానీ, దానిని షేర్ చేసే వ్యక్తి అది నిజమని నమ్ముతారు. తప్పుడు సమాచారం అని తెలిసీ ఉద్దేశపూర్వకంగానే షేర్ చేస్తారు. ఏదైనా సమస్యకు లేదా వ్యక్తికి సంబంధించిన కంటెంట్ అబద్ధమైతే మనల్ని ఆ వార్త తప్పుదారి పట్టించవచ్చు. ముఖ్యాంశాలు, విజువల్స్, క్యాప్షన్‌లు కంటెంట్‌కు సరిపోని విధంగా ఉంటాయి. మోసగించడానికి ఫొటోలు, కంటెంట్‌ను తారుమారు చేస్తుంటారు.

వాస్తవం తెలుసుకోవాలంటే..

- గూగుల్ రివర్స్ ఇమేజ్ చెక్ చేయాలి. లేదా ఫొటో వెరిఫికేషన్ కోసం www.tineye.comని ఉపయోగించాలి.
- ఫొటో లేదా వీడియో (https://www.invid-project.eu/tools-and-services/invid-verification-plugin/) కోసం ఇన్‌విడ్ టూల్‌కిట్ ఎక్స్‌టెన్షన్‌ని ఇన్‌స్టాల్ చేయాలి.
- ఫార్వర్డ్ చేసే ముందు ఏదైనా ఒక అంతర్జాతీయ ఫాక్ట్-చెకింగ్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్‌తో www.factly.in వాస్తవాన్ని చెక్ చేయాలి.

ఇలా గుర్తించాలి...

డీప్ ఫేక్ వీడియో లేదా ఆడియోలో ఏవైనా లోపాలు ఉన్నాయేమో జాగ్రత్తగా పరిశీలించడం, వినడం చేయాలి.

- డీప్ ఫేక్ వీడియో లేదా ఫొటోలలో లైటింగ్ నీడలను చెక్ చేయాలి. కొన్నింటిలో నీడలు కచ్చితంగా కనిపించకపోవచ్చు. ఇవే కాకుండా ఇంకేమైనా లోపాలు ఉన్నాయేమో చెక్ చేయాలి.
- వీడియోలలోని బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయాలి. సబ్జెక్ట్‌కు వీడియోలోని వ్యక్తుల కదలికల సరిపోలకపోవచ్చు. అంటే, ఏఐ టెక్నాలజీ ద్వారా నకిలీ వ్యక్తుల సృష్టి అయి ఉండవచ్చు.
- వీడియోలో వ్యక్తి కనురెప్పలు ఆర్పుతున్నారో లేదో పరిశీలించాలి.
- లైవ్ వీడియోలో మాట్లాడుతున్నప్పుడు ముఖాన్ని ఎడమ లేదా కుడికి కదిలించమని సదరు వ్యక్తిని ఉద్దేశించి అడగాలి.

తనిఖీ చేసే విధానం..

- వీడియో మూలం ఎక్కడ ఉందో చెక్ చేయాలి. అది విశ్వసనీయమైనదే అని నిర్ధారించుకోవడానికి ప్రయత్నించాలి.
- సమాచారం నిజమైనదైనా ప్రత్యామ్నాయంగా ఇతర మూలాధారాల కోసం వెతకాలి.
- వీడియోలో అసహజమైన కదలికలు ఉన్నాయేమో గమనించాలి.
- డీప్ ఫేక్స్ గుర్తించడానికి 'డీప్ ఫేక్ డిటెక్షన్ మోడల్' వంటి స్పెషల్ సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది.
- వీడియోలోని సంఘటనలు నమ్మదగినవేనా? ఆ వీడియో ఏ సందర్భాన్ని బట్టి తీశారో ఆ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.
- వీడియోలో ఉన్న వ్యక్తిని మెయిల్, ఫోన్ ద్వారా సంప్రదించి, ప్రామాణికతను ధృవీకరించుకోవడానికి ప్రయత్నించవచ్చు.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,** డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్

అందంగా పెంచుకుందాం!





గోళ్లు ..పొడవుగా అందంగా ఉండే ఉండాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. కానీ కొందరిలో కొద్దిగా పెరగగానే విరిగిపోతుంటాయి. కొంతమందికి అసలు పెరగవు. దీంతో నెయిల్ పెయింట్ వేసుకోవాలంటే ఇబ్బంది. గోళ్లను చక్కగా పెంచే ఈ ఐదు చిట్కాలు పాటించి చూడండి మీ కోరిక తీరుతుంది..

- గోళ్ల పెరుగుదలను ప్రోత్సహించడంలో ఆలివ్ ఆయిల్ ముందుంటుంది. దీనిలోని విటమిన్ ఇ గోళ్లకు పోషణ అందించి చక్కగా పెరిగేలా చేస్తుంది. రాత్రి పడుకోబోయే ముందు కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను గోళ్లమీద రాసి మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ చక్కగా జరిగి గోళ్లలో పెరుగుదల కనిపిస్తుంది.
- టీస్పూను యాపిల్ సైడర్ వెనిగర్‌లో టీస్పూను వెల్లుల్లి తరుగు వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గోళ్లపై రాసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే గోళ్లు విరగకుండా చక్కగా పెరుగుతాయి.
- వెల్లుల్లి రెబ్బను రెండు ముక్కలు చేసి గోళ్లపై పదినిమిషాలపాటు రుద్దాలి. కొద్దిరోజుల్లోనే గోళ్ల పెరుగుదల కనిపిస్తుంది.
- ఆరెంజ్ జ్యూస్‌ను గోళ్లకు పూతలా అప్లైచేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది గోళ్లను అందంగా పెరిగేలా చేస్తుంది.
- ఇవన్నీ చేయలేకపోతే కొబ్బరినూనెను గోళ్లపై రాసి రోజూ మర్దన చేయాలి. కొబ్బరినూనెలోని ఫ్యాటీ ఆమ్లాలు, ఇతర పోషకాలు గోళ్ల పెరుగుదలకు దోహదపడతాయి.

ఇంటిప్స్







- ఒక్కో నిమ్మకాయను అల్యూమినియం ఫాయిల్‌లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.
- శాండ్ విచ్ మరీ మెత్తగా కాకుండా చక్కగా రావాలంటే... శాండ్ విచ్‌లో పెట్టే కూరగాయలు, బ్రెడ్ మయనేజ్, చీజ్ గది ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. ఇంతకు మించి వేడిగా ఉండే తేమ చేరి శాండ్ విచ్ మెత్తగా మారిపోతుంది.
- కొన్నిసార్లు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత గట్టిగా మారుతుంటాయి. ఇలాంటప్పుడు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత చల్లని నీటిలో ఐదు నుంచి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కూరలో వేస్తే పన్నీర్ ముక్క మృదువుగా, మెత్తగా ఉంటుంది.